ప్రకాశం జిల్లా తేది:16.09.2022

రోడ్డు ప్రమాదం అంటే వ్యక్తి రోడ్డుపై పడడం కాదు... వారిపై ఆధారపడిన కుటుంబం రోడ్డుపై పడటం

ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలి:ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీమతి మలిక గర్గ్ ఐపియస్ గారు

వాహన ప్రయాణాల్లో అశ్రద్ధ అనర్థం... అతివేగం అత్యంత ప్రమాదకరం

బైకుపై వెళ్తున్నప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడమే కాకుండా ఓవర్ స్పీడింగ్ వలన కొత్తగా పెళ్లయి ఎంతో జీవితం చూడాల్సిన యువకుని కలలు మరియు బాల్యప్రాయంలో అల్లరి ముద్దుగా తిరుగుతున్న బాలుని నిండు ప్రాణాలు బలయ్యాయి. అతనే తన సర్వస్వం, అతనే తమ ఆధారం అనుకున్న ఒక ఇల్లాలు మరియు వృద్ధ తల్లిదండ్రుల్లో, ఆనందం, ఆప్యాయత, అనురాగాలతో ఉన్న ఒక కుటుంబంలో తీరని శోకాన్ని నింపాయి.

వివరాలలోకి వెళ్తే దర్శిలోని శివరాజ్ నగర్ కాలనీకి చెందిన బండారు విజయ్ కుమార్ ( 24 సం.) తన తల్లిదండ్రులకు గల 6గురు సంతానంలో 5వవాడు, నెల క్రితమే వివాహం అయ్యిఉండగా తేదీ:15.09.2022 రాత్రి తన అన్న అశోక్ ఇంట్లో అలిగి బస్సెక్కి వెళ్తున్నాడన్న హడావుడిలో హెల్మెట్ ధరించకుండా తన పెద్దన్న కొడుకు వెంకటేశ్వర్లును (13 సం.) కలిసి బైక్ పై వెళ్తుండగా చలివేంద్రం గ్రామ పెట్రోల్ బంకు వద్ద ముందు వెళ్తున్న బస్సును ఓవర్ స్పీడ్ తో క్రాస్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఇద్దరి తలకు మరియు శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యి హాస్పిటల్లో చికిత్స పొందుతూ మరణించారు.

విజయ్ కుమార్ బేల్దారి పనులు చేస్తూ తల్లిదండ్రులను బాగోగులు చూసుకుంటూ ఉంటున్నాడని, క్రొత్తగా పెళ్లి అయ్యినదని, దురదృష్టవశాత్తు హెల్మెట్ లేకుండా అతివేగం వలన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అతనిపై ఆధారపడ్డ భార్య, తల్లిదండ్రులకు తీరని లోటును మిగిల్చిందని జిల్లా ఎస్పీ గారు ఆవేదన వ్యక్తపరిచారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వలన ప్రమాదాలు జరిగి అనేక మంది వారి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, దాని ప్రభావం వారి కుటుంబంలో భార్యతో పాటు వారిపై ఆధారపడ్డ తల్లిదండ్రులపై ఎంతోగాను ఉంటుందని ఎస్పీ గారు గుర్తు చేశారు. కావున వాహనదారులు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని, అతి వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, వాహనాలు నడిపేటప్పుడు మీ భద్రత మరియు మీ కుటుంబ క్షేమం దృష్టిలో ఉంచుకొని సురక్షితంగా గమ్యస్థానాలను వెళ్లాలని ఎస్పీ గారు సూచించారు.



బండారు విజయ్ కుమార్ , ( 24 సం.)